# అతీత మానసం

**-జి.ఎల్.నరసింహ ప్రసాద్**

**కాలప్రవాహంలో ఒక దశాబ్దం క్రిందటి వ్యవహారం ఇది. ఉరవ కొండ... అనంతపురం జిల్లాలో ఓ మోస్తరు గ్రామం. బళ్లారి కూడా చాలా దగ్గర కావడంతో వారి తెలుగు భాషలో అనేక కన్నడ పదాలు కలిసిపోయేవి. ఊరిలో ఎక్కడ చూసినా మూఢనమ్మకాలే. గ్రామ వీధు లలో 'ఏడు తలల తాయమ్మ' అనే గ్రామ దేవత రాత్రి సంచరిస్తుందని చెప్పుకునేవారు. రాత్రి తొమ్మిదింటికి వీధుల్లో నరసంచారం వుండేది కాదు. అటువంటి చోట కళాశాల స్థాపన ప్రజలకు మేలు చేస్తుందని ప్రభుత్వం చాలాకాలం క్రిందటనే కాలేజీని ప్రారంభించింది.**

అటువంటి జూనియర్ కాలేజిలో మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ తరగతిలోకి ఇంగ్లీష్ లెక్చరర్ 'సదయ్' ప్రవేశించాడు. పొడవు, పొట్టీ కాని రూపం ఆయనది. ముఖంలో కొట్టొచ్చి నట్టు కనిపించే శుద్ధసత్వం. మొదటి క్లాస్ కావ డంవల్ల ఆ నూతన విద్యార్థులలో ఈయనేం చెబుతాడా అనే ఆసక్తి తొంగి చూస్తూవుంది.

మల్లిగాడు..వాడు పూర్తిపేరు మల్లిఖార్జున. రెండు, మూడుసార్లు పదో తరగతి తప్పి ఇంట ర్‌లో అతికష్టంమీద ప్రవేశించాడు. అప్పుడే అందరి లెక్చరర్ల గురించి కూపీ లాగినట్టున్నాడు. వాడు నా చేవిలో మెల్లగా గొణిగాడు.

"రేయ్! ఈయన మొదట అందర్నీ ధ్యానం చేయమంటాడ్రోయ్!"

ఇది నాలో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఆ వూరిలో భక్త సంఘాల తరపున ఎక్కడ భజనలు జరిగినా నేను హాజరై పూనకం వచ్చినవాడిలా ఊగి ఊగి భజనలు చేసేవాడిని. బహుశా అందు కేనేమో పదో తరగతి లెక్కలలో కేవలం ముప్ప య్యారు మార్కులు మాత్రమే వచ్చాయి. దీనితో భజనల మహత్యంమీద అప్పుడే అపన మ్మకం మొదలయ్యింది. ధ్యానం...కొత్త ప్రక్రియ... దీన్ని ఒకసారి ప్రయత్నిస్తే పోలేదా? అనిపించి మాస్టారేం చెబుతాడా అని చూస్తు న్నాను.

"మై డియర్ స్టూడెంట్స్! గుడ్ మార్నింగ్.." సదయ్ స్త్రీత్వంతో కూడిన గొంతుతో విద్యార్థు లను విష్ చేశాడు.

"గుడ్ మార్నింగ్ సర్!" స్టూడెంట్స్ ప్రతి ధ్వని.

"మీరంతా ఈ కాలేజిలోనే ఎందుకు చేరారు?" మాస్టారి మొదటి ప్రశ్న.

మల్లిగాడు, సరళ ఆ ప్రశ్నకు ఒకరి ముఖాలు ఒకరు చూసుకుని కిసుక్కున శబ్దం రాకుండానే నవ్వేసుకున్నారు. దాంతో వారిద్దరూ ఈ కాలేజి లోనే ఎందుకు చేరారో నాకిట్టే తెలిసిపోయింది కాని అసలు నేనెందుకు చేరానో నాకొక పట్టాన తెలియలేదు.

అంతలో మాస్టారు కొనసాగించారు. "ఈ ఇంటర్మీడియట్ దశ చాలా కీలకమయింది. మీ జీవితాలకు ఇది ఒక మలుపు. ఈ వయసులో మీలో శారీరక, మానసిక మార్పులు సహజం. కావున ఇప్పుడే మీరు మీ వ్యక్తిత్వాలను నిర్మిం చుకోగలగాలి. దానికోసం మేము మీకు ధ్యానం నేర్పిస్తాం. దీనిలో మంత్రం, తంత్రం ఏమీ వుండవు. పాఠం ప్రారంభమయ్యేముందు ఒక ఐదు నిమిషాలపాటు కళ్లు మూసుకుని కూచో వాలంతే"

"ఇదేదో బాగానే వుందిరోయ్. పాఠం ముందు క్లాస్‌లో కాసేపు కునుకు తీయొచ్చన్న మాట" మళ్లీ మల్లిగాడి కామెంట్. ఆ మాటలకు సరళ మళ్లీ మల్లిగాడిని మత్తుగా ఎందుకు చూసిందో అప్పట్లో నాకర్థం కాలేదు.

తరువాత ఆ పీరియడంతా రోజూ ధ్యానం ఎలా చేయాలో మాస్టారు చెప్పారు. నాకు చాలా విషయాలు కొరుకుడు పడకున్నా పాఠం కంటే ఇదే మేలనిపించి భలే ఆనందపడ్డాను. కాని ఒక అంశం మాత్రం నన్ను చాలా కలవరప రిచింది. ధ్యానం చేస్తే పునర్జన్మ వుండదని...తన కిదే చివరి జన్మ అని మాస్టారు చివరలో చెప్పారు. మరి జన్మజన్మల బంధం కొనసాగిం చాలని ఈ కాలేజిలో చేరిన మల్లిగాడు...సరళల భవిష్యత్తు, ధ్యానంతో ఏమవుతుందో అని నాకు కొంచెం ఆందోళన కలిగింది. అంతలోనే మల్లి గాడు బాంబులాంటి జోక్ పేల్చాడు.

"అదేదో సినిమాలో హీరో విలన్‌ని కొట్టా నంటే పునర్జన్మ లేకుండా పోతావని బెదిరిస్తుం టాడు. అలాంటిదేనన్నమాట ధ్యానమంటే..." ఈసారి ఇది మాస్టారికి వినపడింది. కాని అంతలో బెల్ మోగడంతో మనోడు బతికిపో యాడనుకున్నాం.

"మల్లీ! సార్‌కు ఇదే చివరి జన్మకాబట్టి వచ్చే జన్మలోనైనా మనకు ఇంగ్లీష్ బాగా వస్తుం దేమో" సరళ గమ్మత్తుగా అంది . అప్పట్లోనే సర ళకు ఇంత సెన్సాఫ్ హ్యూమర్ మరియు ప్రెజెన్స్ ఆఫ్ మైండ్ ఎలా వచ్చిందో నాకైతే ఇప్ప టికీ అర్థం కాదు.

మరుసటి రోజు మరలా తన పీరియడ్‌లో సదయ్ మాస్టారు చెప్పడం ప్రారంభించారు. "ధ్యానంవల్ల మీలో మూలాధారం వద్ద పాము లాగా చుట్టుకొనివున్న కుండలిని పైకిలేచి మీకు అతీతమానసం సిద్ధిస్తుంది"

"అతీతమానసం అంటే?" మల్లిగాడి లొల్లి.

"సిక్స్త్ సెన్స్" మాస్టారి జవాబు. అది కాస్త 'సెక్స్ సెన్స్'గా వినపడినట్టుంది...సరళ కళ్లల్లో మెరుపు. నాకు మాత్రం ఇదంతా అర్థంకాక న్యూసెన్స్‌గా కనిపించడం ప్రారంభించింది.

"టెలీపతిలాంటి శక్తులొస్తాయి" మాస్టారు ఇంకింత ఊరించారు. 'పతి' మాట చెవిన పడగానే మల్లిగాడివైపు ఓరగా చూస్తూ "అంటే ఏమిటి సార్?" అని సరళ తమకంగా ప్రశ్నించింది.

"ఎక్కడో దూరంగా జరిగే విషయాలు మనకు ఇట్టే తెలిసిపోవడం" సదయ్ మాస్టారి సన్నాయి నొక్కులు. దీనితో అందరిలో ఉత్కంఠ ప్రవేశించింది. అంటే "ఫైనల్ పరీక్ష ప్రశ్నలు కూడా తెలిసిపోతాయా?" టెన్షన్ భరించలేక నేనడిగేసాను. మాస్టారు సమాధానమిచ్చేలోగానే మల్లిగాడు తెలుగు సినిమా క్లైమాక్స్‌లో పోలీసు వాళ్లలాగా కలగజేసుకున్నాడు.


"ధ్యానం వల్ల ప్రశ్నలు తెలుసుకోవచ్చేమోగాని జవాబులు తెలియాలంటే మాత్రం చదవాలమ్మా" అని వాడి వైఫల్యాల అనుభవాన్నంతా రంగరించి మామీద కుమ్మరించాడు.

ఈ కామెంట్‌తో మాస్టారికోపం సహస్రారాన్ని చేరినా, అనుభవజ్ఞుడు కాబట్టి నిగ్రహించుకున్నాడు.

"ఎనివే మై డియర్ స్టూడెంట్స్! మీతో ధ్యానం ప్రాక్టీస్ చేయించడానికి రేపు ఆదివారం రోజున మనమంతా బూదగవికి పిక్నిక్ వెళుతున్నాం" అని మాస్టారు ప్రకటించడంతో అందరం ఉత్సాహపడిపోయాం.

"అక్కడ మీకు ధ్యానదీక్ష ఇస్తాను" అని అనేక రకాల దీక్షల గురించి మాస్టారు ఆ క్లాస్‌లో వివరించి వెళ్లిపోయారు. బూదగవి ఉరవకొండ పక్కనేవున్న చిన్నపల్లె. అక్కడ ఉన్న ఇరుకు గుహలలో అనేకమంది బౌద్ధయోగులు ఒకప్పుడు ధ్యానం చేసేవారని చెప్పుకుంటూ ఉంటారు.

ఆదివారం రానే వచ్చింది. ఎర్రబస్సులో ఎర్రమట్టి రోడ్డుమీద ప్రయాణం.



బస్సుజనంతో కిటకిటలాడుతూ వుంది. ఒక్కరికి కూడా సీటు దొరక లేదు. అందరూ నిలబడే ప్రయాణిస్తున్నా.

మల్లిగాడు...సరళ ఎదురెదురుగా నిలబడి దృగ్దీక్ష తీసుకుంటున్న యోగుల్లాగా ఉన్నారు. బస్సు వేగం పెరిగినపుడు సరళకు స్పర్శదీక్షనిస్తు న్నాడు మల్లిగాడు. కొండకచో హస్తమస్తక సంయోగం చేసినట్టు కూడా నాక నిపించింది. వాడు మాస్టారు నిన్న క్లాస్‌లో చెప్పిన అన్ని దీక్షలను ఆమెకి చేస్తున్నాడు.

ఆలింగన దీక్ష కూడా ఇచ్చేంతలో 'బూదగవి' రావడం జరిగింది. వీరిద్ద రినే గమనిస్తున్న నాకు థ్రిల్ వల్లనో...టెన్షన్‌వల్లనో విరేచనాలయ్యే పరిస్థితి. బూదగవిలో దిగేసరికి ఆ బస్సువలన రేగిన దుమ్ము వల్ల అందరికీ ఒకటే దగ్గు. విరేచనాల భయంవల్ల నేను మాత్రం దగ్గును ఉగ్గబెట్టుకోవలసిన దౌర్భాగ్యస్థితి.

చివరకు అందరం బూదగవిలో ఒక ఇరుకు మార్గంగల గుహలో చొర బడ్డాం. మా వెంట తెచ్చుకున్న రెండు చీపుర్లతో అంతా శుభ్రం చేసి కొవ్వొ త్తులు వెలిగించాం.

మాస్టారు అందరిని పద్మాసనంలో కూచోమన్నారు. ఆ నిశ్శబ్దంలో సదయ్ మాస్టారు మెల్లగా చెప్పడం ప్రారంభించారు.

"దివ్యాత్మ స్వరూపులారా! మనం ఇప్పటికే వివిధ చక్రాల గురించి, కుండలినీ గురించి చాలాసార్లు చెప్పుకున్నాం. ఈరోజు ప్రాక్టికల్‌గా వాటిని అనుభూతిలోకి తెచ్చుకోబోతున్నాం. ధ్యానం చేస్తూవుంటే మీ మూలా ధారం దగ్గరవున్న కుండలినీ పాములాగా పైకి లేవడాన్ని మీరు ఈరోజు గమనించబోతారు. ఓ.కె...ఇక అందరూ కళ్లు మూసుకుని ధ్యానమగ్నులు కండి. నేను చెప్పేవరకు కళ్ళు తెరవద్దు" గుహలో సార్ స్వరం ప్రతిధ్వనిం చింది.

నేనూ అందరితోపాటు కళ్లు మూసుకున్నాను. ధ్యానం అంటే ఇలా చీకట్లో కూచోవడమనుకోలేదు. మొదటే నాకు చీకటంటే చచ్చేంత భయం. ఇప్పుడిది బూదగవిలా లేదు...భూతాలగవిలా వుంది. అంతలో నా ధ్యాస మల్లిగాడు సరళలపైకి మళ్లింది. వాళ్లు ఈ చీకటిలో ఏం చేస్తుంటారో అనే ఆలోచన కలిగింది.

ఇక ఉత్కంఠ ఆపుకోలేక కళ్లు తెరిచిన నేను నా ఎదురుగా కొంచెం దూరంలో కనిపించిన దృశ్యం చూసి బిర్రబిగుసుకు పోయాను...నోరెండి పోయింది.

ఎలాగో గొంతు పెగల్చుకుని "మాస్టారు! మీరింతకాలం చెబుతున్న కుండలిని మీకెదురుగా కూచుని పైకి లేస్తున్నది" అని అరిచాను.

ఆ కేకకు లేచిన మిగిలిన వారు "నీ కుండలిని దొంగలు తోల...అది నాగుపాముురా నాయనా...పరుగెత్తండ్రి" అంటూ ఒకరిమీద ఒకరు పడుతూ లేస్తూ పరుగు లంకించుకున్నారు.

మల్లిగాడు..సరళకూడా ఒకరి చేతులు ఒకరు పట్టుకొని గుహద్వారం గుండా బయటకు పరుగెత్తారు. కళ్లు తెరచిన మాస్టారు కూడా భయంతో బిక్కచచ్చిపోతూనే, కదిలితే కాలనాగు ఎక్కడ కాటువేస్తుందో అని నేలకు అతుక్కుపోయి కూచున్నాడు.

ఈ గందరగోళం అంతా పాముకు నచ్చక కాబోలు అది ఎక్కడికో మెల్లగా జారుకుంది. బతుకు జీవుడా అనుకుంటూ గుహ బయటకు వచ్చి అందరూ క్షేమంగా వుండడంతో సదయ్ మాస్టారు ఒక పెద్ద నిట్టూర్పు విడి చారు.

ఈ షాక్‌నుంచి బయటపడటానికి మాకందరికి అర్థగంట పట్టింది.

ఉన్నట్టుండి మాస్టారు "మల్లిగాడు..సరళ ఎక్కడ?" అని అడగడంతో మాకందరికి వారిద్దరూ లేచిపోయారన్న సత్యం అర్థమయ్యింది. వారికోసం వెదికినా ప్రయోజనం కనిపించలేదు.

చేయిలో చేయి వేసుకుని మల్లిగాడు, సరళ బయటకు పరిగెత్తిన దృశ్యం ఇంకా నా మనస్సులో మెదులుతూనే ఉంది. టెలిపతీశక్తి కలిగిన మాస్టారి 'అతి మానసం' కూడా వారి ఆచూకి చెప్పలేకపోయింది.

ఈ దెబ్బతో మాస్టారికి ధ్యానం పిచ్చి వదిలి పరధ్యానం పట్టుకుంది. ఇన్ని సంవత్సరాలవుతున్నా వారిద్దరూ మాత్రం తిరిగిరాలేదు. తరువాత సార్ మాకు ఎప్పుడు ధ్యానం గురించి చెప్పినప్పటికి నేను మాత్రం ఆ ప్రేమజంట క్షేమంగా ఉండాలని కాంక్షిస్తూ గత పదేండ్లుగా ధ్యానం చేస్తూనే వున్నాను.

అన్నట్టు...ఒక విషయం చెప్పడం మరిచాను...నేనిప్పుడు మా స్టూడెం ట్స్‌కు ధ్యానం నేర్పుతున్నాను.

☆



## గడ్డకట్టిన నయగారా

1932వ సంవత్సరం చలికాలంలో ఎంత చల్లగా ఉందంటే నయా గారా జలపాతం యావత్తూ ఒక మంచు ఖండంలా గడ్డ కట్టుకుపోయిం దిట.

## తోకచుక్క డెవిల్స్ ఏజెంట్

1456లో పోప్ కేలిక్స్‌టస్ హేలిస్ తోకచుక్క వచ్చినప్పుడు అది డెవిల్ (సైతాన్) యొక్క ఏజెంట్ అని ప్రకటించాడట.

-తటవర్తి

